క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

జీడిమెట్ల: ఐడీఏ జీడిమెట్ల సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్నట్లు ఏఏఈ వెంకటనారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం 11కేవి హెచ్ఎంటీ ఫీడర్, 33బై 11కేవీ ఎస్ఎస్1 సెక్షన్ పరిధిలో మెయింటనెన్స్ పనులు ఉన్నందున హెచ్ఎంటీకాలనీ, షాపూర్‌నగర్ ఏరియాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ నిలిపివేయనున్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్సీ



వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్సీ

కుత్బుల్లాపూర్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి గురువారం ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యేందుకు కుత్బుల్లాపూర్ ప్రాంతానికి వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు ఆయనకు స్వాగతం పలికి తన నివాసానికి తీసుకువెళ్లారు. తాజాగా జరుగుతున్న రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు సమాచారం. జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, పలువురు ప్రజాప్రతినిధులు సైతం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

'బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల పాలైంది'

సుభాష్‌నగర్: తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల పాలైందని.. కాంగ్రెస్ పార్టీ తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. గురువారం గాజులరామారం డివిజన్ పరిధి ఉమాదేవినగర్, ఎన్టీఆర్‌నగర్-బిలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీలకు కార్యకర్తలు 150 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన పున్నారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీపై అధికార పార్టీ లేనిపోని ఆరోపణలు చేస్తూ ప్రజలను దూరం చేసే ప్రయత్నం చేస్తోందన్నారు. కానీ కాంగ్రెస్‌లో చేరే వారి సంఖ్య పెరుగుతూనే ఉందన్నారు. ఎన్ని కుతంత్రాలు చేసినా బీఆర్ఎస్ కుటుంబ పాలనకు చరమగీతం పాడేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని అన్నారు. యువత, మహిళలు, అన్నివర్గాల ప్రజలు తమ వైపే ఉన్నారని స్పష్టం చేశారు.

మనూలో వర్క్‌షాప్

రాయదుర్గం: ఉర్దూ మాట్లాడే జనాభాకు ఉర్దూ విశ్వవిద్యాలయం గురించి తెలియజేయాలని వీసీ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఆధ్వర్యంలో డీడీఈ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న ప్రాంతీయ డైరెక్టర్లు(ఆర్డీలు), అసిస్టెంట్ రీజినల్ డైరెక్టర్లు (ఏఆర్డీలు)కు రెండు రోజుల పాటు వర్క్‌షాప్ కమ్ ఓరియంటేషన్ నిర్వహించారు. అనంతరం డీడీఈ మాన్యువల్, ప్రోగ్రామ్ గైడ్‌లను ఆవిష్కరించారు.

ఓయూలో జీ-20 పోటీలు

లాలాపేట: జీ-20 యూనివర్సిటీ కనెక్ట్‌లో భాగంగా ఓయూ ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను గురువారం ప్రిన్సిపాల్ ప్రొ. గణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా వారిలోని నైపుణ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ అనుబంధ కళాశాలల నుంచి దాదాపు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశోధనలను ప్రోత్సహించాలి

- హెచ్‌సీయూ వీసీ ప్రొ.బీజే రావు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఫ్యాకల్టీతో జెనెటిక్ కౌన్సెలింగ్ బోర్డు సభ్యులు కలిసి పనిచేయాలని వీసీ ప్రొఫెసర్ బీజేరావు సూచించారు. గురువారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో బోర్డ్ ఆఫ్ జెనెటిక్ కౌన్సెలింగ్‌తో కలిసి 8వ వార్షిక అంతర్జాతీయ సదస్సు-2023ను జ్యోతి వెలిగించి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశంలో జెనెటిక్ కౌన్సెలింగ్ వృత్తిని అభివృద్ధి చేయడానికి అకడమిక్, టీచింగ్ ట్రెనింగ్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో కీలకోపన్యాసం చేసిన పద్మశ్రీ ప్రొఫెసర్ ఆర్ఎంకె బమేజాయ్ మాట్లాడుతూ జన్యుపరమైన రుగ్మతలను అంచనా వేయడానికి, రోగికి, వారి కుటుంబాలకు ఉత్తమ నిర్వహణను అందించడానికి వ్యక్తిగత విధానాన్ని అనుసరించాలని జన్యు సలహాదారులకు సూచించారు. పోస్టర్‌లతో దాదాపు 100 సారాంశాలు అందించారు. మూడు కేటగిరీల కింద ఆరు ఈ పోస్టర్లను ఎంపిక చేశారు. 'జెనెటిక్ కౌన్సెలింగ్ యొక్క టీచింగ్, ట్రెనింగ్ కోర్ స్కిల్స్' అనే అంశంపై హైబ్రిడ్ వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ డీన్ ప్రొ.శివకుమార్, ప్రొఫెసర్ ప్రకాశ్‌బాబు, డాక్టర్ క్యాఅన్నీ హసన్‌తోపాటు పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షం కురిసిన ప్రతిసారీ..

నాలాల్లోకి రసాయనాలను వదులుతున్న పరిశ్రమలు



నాలాలో పారుతున్న రసాయనాలు

జీడిమెట్ల: చినుకు పడితే చాలు, రసాయన పరిశ్రమల ఆగడాలకు అంతులేకుండా పోతోంది. నాలాల్లోకి రసాయనాలను వదులుతూ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. వర్షం కురిసిన ప్రతిసారి వర్షపు నీటిలోకి వ్యర్థ రసాయనాలను డంప్ చేస్తున్నారు. దీంతో ఓపెన్ నాలాలు, నాలాల పరివాహక ప్రాంతాల్లో రసాయనాల ఘాటైన వాసన గుప్పుమంటోంది. పారిశ్రామికవాడకు ఆనుకుని ఉన్న ఎస్ఆర్ నాయక్‌నగర్, అపురూపాకాలనీ, వినాయకనగర్, గంపలబస్తీ, సుభాష్‌నగర్, చింతల్ ప్రాంతాల ప్రజలు రసాయనాల ఘాటైన వాసనలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

◆ గుట్టుచప్పుడు కాకుండా నాలాల్లోకి..

కొన్ని ఫార్మా, బల్క్‌డ్రగ్, రసాయన పరిశ్రమల సిబ్బంది పరిశ్రమల్లో వెలువడిన రసాయనాలను పరిశ్రమ అవరణలో నిర్మించుకున్న భూగర్భ ట్యాంకర్లలో వ్యర్థ రసాయనాలను నిలువ చేస్తారు. వర్షం కురిసిన ప్రతిసారి రాత్రిపూట గుట్టుచప్పుడు కాకుండా రసాయనాలను నేరుగా నాలాల్లోకి మోటర్ల ద్వారా డంప్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇక అంతే రసాయనాల ఘాటైన వాసనలకు నాలా పరీవాహక ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



ఓ పరిశ్రమ నుంచి బయటకు వెళ్తున్న వ్యర్థాలు

◆ తనిఖీలు మరిచిన పీసీబీ అధికారులు

రసాయన, ఫార్మా బల్క్ డ్రగ్ పరిశ్రమల్లో విరివిగా తనిఖీలు నిర్వర్తించాల్సిన పీసీబీ యంత్రాంగం తమకేమీ పట్టదు అన్నట్లుగా వ్యవహరిస్తోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక ప్రజలకు పరిశ్రమల ద్వారా ఇబ్బందులు కలగకుండా రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. రసాయనాల డంపింగ్‌కు పాల్పడే పరిశ్రమలను గుర్తించాల్సిన పీసీబీ సిబ్బంది పట్టించుకోవడం లేదన్నారు. గడిచిన రెండు సంవత్సరాల్లో అధికారులు తనిఖీలు చేపట్టిన దాఖలాలు ఎక్కడా లేవని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు చెబుతున్నారు. అసోషియేషన్ల నుంచి పీసీబీ అధికారులకు రాతపూర్వకంగా ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని వారు అంటున్నారు.

◆ పరిశ్రమలకు గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలి..

ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతున్న పరిశ్రమలపై పీసీబీ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో పీసీబీ అధికారులు తనిఖీలు చేసేవారని.. ప్రస్తుతం పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇప్పుడు ఉన్న అధికారులు ఏదో ఉన్నామా అంటే ఉన్నామా అన్నట్లుగా ఉద్యోగాలు చేస్తున్నారని విమర్శిస్తున్నారు.

" చర్యలు తీసుకోవాలి



మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు ఘాటైన వాసన వస్తోంది. గతంలో ఇలాగే వాసన వస్తే పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాం. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి. రసాయనాలను నాలాల్లోకి డంప్ చేసే పరిశ్రమలను గుర్తించి చర్యలు తీసుకోవాలి.

– శ్రీనివాసరావు, ఎస్ఆర్ నాయక్‌నగర్, అధ్యక్షుడు

మళ్లీ చీకటి రోజుల్లోకి నెట్టేందుకు కాంగ్రెస్ యత్నిస్తోంది

- ఎమ్మెల్యే వివేకానంద్
- రేవంత్‌రెడ్డి బేషరుతుగా క్షమాపణలు చెప్పాలి

కుత్బుల్లాపూర్: రైతులకు 24 గంటల పాటు కరెంట్ ఇచ్చి సీఎం కేసీఆర్ న్యాయం చేశారని.. కాని కాంగ్రెస్ పార్టీ మళ్లీ చీకటి రోజుల్లోకి నెట్టేందుకు యత్నిస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. రైతులకు ఉచిత కరెంట్ సరఫరా విషయమై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వాఖ్యలను నిరసిస్తూ గురువారం దుండిగల్ మున్సిపల్ గండిమైసమ్మ చౌరస్తాలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు ధర్నా చేపట్టారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో రైతన్నలు తీవ్ర కష్టాలు ఎదుర్కొన్నారని అన్నారు. అప్పులు చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడ్డారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 24 గంటల పాటు విద్యుత్‌తో పాటు రైతుబంధు, రైతుబీమా పథకాలతో రైతులు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ రైతులకు న్యాయం చేసేందుకు పథకాలు ప్రవేశపెడితే కాంగ్రెస్ మాత్రం రైతులను మళ్లీ పాత రోజుల్లోకి నెట్టాలని చూస్తోందని ఆరోంచారు. ఉచిత కరెంట్‌పై అనుచిత వాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బేషరుతుగా క్షమాపణలు చెప్పాలన్నారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీని పొలిమేరల్లో సైతం అడుగు పెట్టబోనీయమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, మున్సిపాల్, డివిజన్ల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, రైతులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వివేకానంద్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

మేయర్ నీలారెడ్డికి కృతజ్ఞతలు

నిజాంపేట్: బాచుపల్లి సాయినగర్‌లో ముస్లింలకు కేటాయించిన స్థలానికి నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇచ్చిన నేపథ్యంలో గురువారం నిజాంపేట్ కార్పొరేషన్ కో.ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీం ఆధ్వర్యంలో మైనార్టీలు మేయర్ నీలా రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. కో.ఆప్షన్ సభ్యులు వాణి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు చంద్రగిరి సతీష్, శ్రీనివాస్, బాచుపల్లి ముస్లిం మైనారిటీ ప్రధాన కార్యదర్శి ఎం.నబీ, వైస్‌ప్రెసిడెంట్ అలీ, సభ్యులు షకీల్, సలీం, ఫారుఖ్, పాషా, షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కుత్బుల్లాపూర్: ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సుభాష్‌నగర్ వివేకానంద విద్యా మందిర్ పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా అభ్యర్థులు అడ్మిషన్ పొందవచ్చన్నారు. పూర్తి వివరాలకు 98661 34372 / 98497 34372లో సంప్రదించాలని ఆయన కోరారు.

కొలువులు రావాలంటే బీజేపీని గెలిపించాలి



శ్రీశైలంగౌడ్‌కు హారతులు పడుతున్న మహిళలు

కుత్బుల్లాపూర్: యువతకు కొలువులు రావాలంటే కమలం పార్టీని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ గోస – శ్రీశైలం అన్న భరోసా కార్యక్రమంలో భాగంగా గురువారం కుత్బుల్లాపూర్ డివిజన్‌లోని అంబేద్కర్‌నగర్, చెరుకుపల్లికాలనీ, బాలరెడ్డినగర్ బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలతో పాటు పెన్షన్లు, రేషన్‌కార్డులు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇప్పించాలని ప్రజలు కోరడంతో న్యాయం చేస్తాని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉచితంగా రేషన్ బియ్యం అందిస్తోందన్నారు. కేంద్ర సంక్షేమ పథకాలతో కోట్లాది మంది లబ్ధి పొందుతున్నారని తెలిపారు. సమస్యలను స్థానిక కార్పొరేటర్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో కుటుంబ పాలనను అంతం చేయాలంటే బీజేపీకి మద్దతు ఇవ్వాలన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రాజేశ్వరరావు, సెన్సార్ బోర్డు సభ్యుడు నటరాజ్‌గౌడ్, డివిజన్ ఇన్‌చార్జ్‌లు కృష్ణాయాదవ్, శ్రీధర్ వర్మ, నాయకులు దయాకర్, కిరణ్ యాదవ్, విజయ్‌గుప్తా, వీరేందర్‌గుప్తా, లింగం యాదవ్, అలివేలు, వెంకటేష్‌యాదవ్, రవిగౌడ్, జానయ్య, భూషణం తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న కూన శ్రీశైలంగౌడ్

కార్యకర్తల కుటుంబాలకు అండగా బీఆర్ఎస్



కార్యకర్త కుటుంబసభ్యులకు బీమా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బహదూర్ పల్లి 15వ వార్డు శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త సదానందం (38) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కాగా బీఆర్ఎస్ సభ్యత్వం ఉండడంతో రూ.2 లక్షల ప్రమాద బీమా మంజూరయ్యింది. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గురువారం మృతుడి నివాసానికి వెళ్లి సదరు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్యకర్తలకు అండగా ఉండి వారి కుటుంబాలకు భరోసా కల్పించే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు.

త్వరలో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభిస్తాం



రోడ్డు పనులను పరిశీలిస్తున్న అధికారులు

దుండిగల్: రోడ్డు విస్తరణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు. గండిమైసమ్మ నుంచి బహదూర్‌పల్లి వైపు వెళ్లే రోడ్డు వెడల్పు పనులు మధ్యలో ఆగిపోయాయి. ఇక్కడ తరుచూ ప్రమాదాలు జరుగుతుండడంతో స్థానికుల నుంచి పలుమార్లు ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై స్పందించిన అధికారులు చర్యలకు ఉపక్రమించారు. గురువారం హెచ్ఎండీఏ డీఈ వేణుగోపాల్, ఎస్సై వెంకట్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ భరత్‌కుమార్ తదితరులు రోడ్డును పరిశీలించారు. ఓ వ్యక్తి 10 ఫీట్లు ముందుకు జరిగిన అంశం కోర్టు పరిధిలో ఉండటంతో సదరు స్థలాన్ని మినహాయించి మిగిలిన రోడ్డు పనులను పూర్తి చేశాలని నిర్ణయించారు.

శాంతినికేతన్ లేఅవుట్ మీదుగా రాకపోకలకు అనుమతించాలి

కుత్బుల్లాపూర్: కొంపల్లి నుంచిదూలపల్లి వెళ్లే వాహనదారులు నూజివీడు సీడ్స్ రోడ్డు డ్రైనేజీ పనులతో మూసి వేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. శాంతినికేతన్ లేఅవుట్ మీదుగా రాకపోకలకు అనుమతించాలని గురువారం కొంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భైరి ప్రశాంత్‌గౌడ్ మున్సిపల్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దూలపల్లి చౌరస్తా మీదుగా వెళ్లాలంటే తీవ్ర ట్రాఫిక్ జామ్ అవుతోందన్నారు. శాంతినికేతన్ లేఅవుట్ దగ్గర మార్గం కావడంతో అటుగా రాకపోకలకు సాగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.




మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ప్రశాంత్‌గౌడ్

ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ కోర్సును ఉపసంహరిస్తున్నాం

లాలాపేట: గత ఐదేళ్ల నుంచి ఆదరణ తగ్గుతున్న నిజాం కళాశాలలోని సెల్ఫ్ ఫైనాన్స్ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ కోర్సును 2023–24 విద్యా సంవత్సరం నుంచి ఉపసంహరిస్తున్నట్లు ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. పి.లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల తీరు తెన్నులను సమీక్షించిన తర్వాతనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా యూనివర్సిటీ ఎప్పటికప్పుడు కోర్సుల ప్రగతిని సమీక్షిస్తోందన్నారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా డిమాండ్ ఉన్న కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే ఇటీవల కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్, డాటా సైన్స్ వంటి పలు కోర్సులను అందుబాటులోకి తెచ్చామని వివరించారు.

విజ్ఞానయాత్రలో విద్యార్థులు



నిజాంపేట్: సనోఫీ ఫార్మా సౌజన్యంతో లైఫ్ చారిటబుల్ ట్రస్ట్, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రగతినగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు గురువారం విజ్ఞాన యాత్ర లో భాగంగా బిర్లా ప్లాంటోరియం, బిర్లా సైన్స్ మ్యూజియంను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, దినకర్, ప్రసన్న భారతి, లైఫ్ చారిటబుల్ ట్రస్ట్‌చైర్మన్ డాక్టర్ ప్రశాంత్, సనోఫీ ఫార్మా ప్రతినిధులు, జనవిజ్ఞాన వేదిక నాయకులు శంకర్‌రావు, మలయ్యాచారి, బాలపీరు తదితరులు ఉన్నారు.

జీఓ.59 లబ్ధిదారులు ఆందోళన చెందొద్దు

- కుత్బుల్లాపూర్ తహసీల్దార్ సంజీవరావు
- లబ్ధిదారులతో సమావేశం



59 లబ్ధిదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్

సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణ నిమిత్తం జీఓ.59 కింద డిమాండ్ నోటీసులు అందుకుని.. ఎక్కువ డబ్బులు వచ్చాయన్న కారణంతో రిజిస్ట్రేషన్ చేయించుకొని వారితో కుత్బుల్లాపూర్ తహసీల్దార్ సంజీవరావు ప్రత్యేక సమావేశమయ్యారు. కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో గురువారం జీఓ.59 లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆక్రమిత ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణ కోసం 2022లో జీఓ.59 జారీ చేయగా కుత్బుల్లాపూర్ మండల పరిధిలో 14,518 దరఖాస్తులు వచ్చాయి. అధికారులు వాటిని పరిశీలించిన అనంతరం 4032 మందిని అర్హులుగా గుర్తిస్తూ వారికి డిమాండ్ నోటీసులు అందించారు. అందులో చాలామందికి రిజిస్ట్రేషన్ నిమిత్తం లక్షల్లో కట్టుమని మెసేజ్ రావడంతో కేవలం 900 మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

లక్షల్లో వస్తే తహసీల్దార్ పేరుతో దరఖాస్తు పెట్టుకోవాలి..

లబ్ధిదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో తహసీల్దార్ వారితో ప్రత్యేక సమావేశమయ్యారు. వారి వివరాలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎవరికైతే నార్మల్ ఫీజు కట్టుమని వచ్చిందో తక్షణమే మూడు విడతలుగా కట్టి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. మరికొంత మందికి అనుకున్న దానికంటే లక్షల్లో వచ్చినట్లయితే తహసీల్దార్ పేరుతో దరఖాస్తు పెట్టుకోవాలని అట్టి దరఖాస్తులను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.

పక్క పక్కనే తేడా....

కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని జగద్గిరిగుట్ట, గాజులరామారం, సూరారం ప్రాంతాలలో ప్రక్క పక్కనే ఉన్న పిల్లవారు జీఓ.59 కింద దరఖాస్తు చేసుకోగా రూ.వేల నుంచి రూ.లక్షల వరకు వ్యత్యాసంతో డబ్బులు కట్టుమని మెసేజ్‌లు వచ్చాయి.

◆ సూరారం డివిజన్ శివాలయం నగర్ చెందిన శ్రీలేఖ, రమేష్ దంపతులు 11 సంవత్సరాల క్రితం 80 గజాల స్థనాలని కొనుగోలు చేసి నివాసం ఉంటున్నారు. అప్పట్లో జీఓ.58 కింద తెలంగాణ పట్టా వచ్చింది. తిరిగి 2022లో జీఓ.59 కింద దరఖాస్తు పెట్టుకోగా ఏకంగా రూ.22 లక్షలు కట్టుమని మెసేజ్ వచ్చింది.

◆ వీరి ఇంటిని అనుకోని ఉన్న మరో వ్యక్తికి కేవలం రూ.65 వేలు కట్టుమని మెసేజ్ వచ్చింది. దీంతో అతను డబ్బులు కట్టలేకపోయాడు. ఇలా చాలా మంది వేలు అనుకుంటే ఏకంగా రూ.20 లక్షల పైన డబ్బులు కట్టుమని రావడంతో వెనకడుగు వేశారు.



ఎక్కువ మొత్తంలో డబ్బులు కట్టాలని వచ్చిన నోటీసులను తహసీల్దార్‌కు చూపిస్తున్న లబ్ధిదారులు

వివరాలతో దరఖాస్తు రాయండి



జీఓ.59 కింద డిమాండ్ నోటీసులు అందుకున్న వారికి ఎక్కువ మొత్తంలో డబ్బులు కట్టుమని మెసేజ్ వచ్చిన వారు వారి వివరాలు తెలుపుతూ తహసీల్దార్‌కు దరఖాస్తు రాయండి. వారి సమస్యను ఉన్నతాధికారులకు నివేదించి త్వరలో సమస్యను పరిష్కరిస్తాం. ఈ విషయమై ఎవరూ ఆందోళన చెందొద్దు.

– సంజీవరావు, కుత్బుల్లాపూర్ తహసీల్దార్